ఔటర్ లోపల కాలనీలకు సమృద్ధిగా తాగునీరు

- నేడు 23 రిజర్వాయర్లను ప్రారంభించనున్న మంత్రులు మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు మరో 23 రిజర్వాయర్లు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, పటాన్‌చెరు నియోజక వర్గాల పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఈ రిజర్వాయర్లను మంత్రులు మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఓఆర్‌ఆర్ ఫేజ్-2లో భాగంగా జలమండలి ఆధ్వర్యంలో రూ.1,200 కోట్లతో 73 రిజర్వాయర్ల నిర్మాణ పనులు చేపట్టగా ప్రస్తుతం 23 అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్డు లోపల 193 గ్రామాలకు మెరుగైన నీటి సరఫరా కోసం రూ.750 కోట్లతో 164 రిజర్వాయర్లు, 1,571 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించి దాహార్తిని తీర్చుతున్నది.

తెలంగాణ టూరిస్టుల రెస్క్యూకు చర్యలు

- వర్షంతో సహకరించని వాతావరణం
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న సీఎస్ శాంతికుమారి
- సిక్కింలో ఆర్మీకి వివరాలందించిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సిక్కిం వరదల్లో చిక్కుకున్న తెలంగాణ టూరిస్టులంతా క్షేమంగా ఉండటంతో వారిని సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్కడ భారీ వర్షం కారణంగా వాతావరణ పరిస్థితులు సహకరించకపోవడంతో రెస్క్యూ వాయిదా పడుతున్నట్టు బాధిత కుటుంబసభ్యులు 'నమస్తే తెలంగాణ' తెలిపారు. ఆదివారం వారిని ప్రత్యేక హెలికాప్టర్‌లో తరలించేందుకు సిక్కిం ఆర్మీ ప్రయత్నించగా.. మళ్లీ భారీ వర్షం పడటం, వరద పెరగడంతో రెస్క్యూ ఆగిపోయిందని చెప్పారు. తెలంగాణకు చెందిన వారిని అక్కడి పోలీసులు సురక్షితంగా ఓ హోటల్‌కు తీసుకెళ్లి, వసతి ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లపై ఢిల్లీ తెలంగాణభవన్ రెసిడెంట్ ఆఫీసర్‌తో సమన్వయం చేసుకుంటూ, సిక్కిం అధికారులతో సీఎస్ శాంతికుమారి మాట్లాడుతున్నారు. వీలైతే హెలికాప్టర్ ద్వారా వాతావరణం అనుకూలిస్తే గ్యాంగ్‌టక్ వరకు రోడ్డు మార్గంలోనైనా మనవారిని రప్పించేందుకు, అక్కడ్నుంచి తెలంగాణ సురక్షితంగా తీసుకొచ్చేందుకు అక్కడి అధికారులతో మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే సిక్కిం డీజీపీ అమరేంద్రకుమార్ సింగ్ (ఏకే సింగ్)తో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడారు. సీవీ ఆనంద్ ఇచ్చిన వివరాల ఆధారంగా వారికి సురక్షితంగా తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాలని సిక్కిం డీజీపీ ఆర్మీ అధికారులకు సూచించారు. ప్రస్తుతం సిక్కింలో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, ఫోన్లకు సిగ్నల్స్ అందకపోవడంతో అక్కడి పోలీసులు శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులో ఉంచారు. దాని ద్వారానే తమ క్షేమ సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేస్తున్నారు.

ఇస్రోకు గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ స్ట్రక్చర్ అందజేత

చెన్నై, అక్టోబర్ 8: అంతరిక్ష ప్రయోగాల్లో అద్భుత విజయాలతో దూసుకెళ్తున్న భారత్.. త్వరలో తన తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)ను చేపట్టేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రయోగానికి అవసరమైన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్-క్రూ మాడ్యూల్ (ఐఏడీటీ-సీఎం) స్ట్రక్చర్‌ను ఇటీవల ఇస్రోకు అందజేసినట్టు చెన్నైకి చెందిన కేసీపీ లిమిటెడ్ సంస్థ ఆదివారం వెల్లడించింది. సాంకేతిక సన్నద్ధతను పరీక్షించుకునేందుకు 2 ఐఏడీటీ క్రూ మాడ్యూల్ స్ట్రక్చర్లను రూపొందించే బాధ్యతను కేసీపీకి ఇస్రో అప్పగించింది. వీటిలో 3,120 కిలోల బరువైన తొలి ఐఏడీటీ-సీఎం 3.1 మీటర్ల వెడల్పు, 2.6 మీటర్ల పొడవు ఉంటుంది. అల్యూమినియంతో తయారైన ఈ స్ట్రక్చర్‌లో పారాచ్యూట్ సిస్టమ్, పైరోస్, ఏవియానిక్స్, బొయాన్సీ ఆగ్మెంటేషన్ సిస్టమ్ లాంటి ప్రధాన ఉప వ్యవస్థలతోపాటు వివిధ రకాలైన 100కుపైగా భాగాలు ఉంటాయి. గగన్‌యాన్‌లో భాగంగా ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులను క్రూ మాడ్యూల్ ద్వారా భూమికి 400 కిలోమీటర్ల ఎగువన ఉండే కక్ష్యలోకి తీసుకెళ్లి 3 రోజుల తర్వాత సురక్షితంగా తిరిగి సముద్ర జలాల్లో దింపుతారు. కేసీపీ సంస్థ రూపొందించిన ఐఏడీటీ-సీఎం గగన్‌యాన్‌లో ఉపయోగించే వాస్తవ మాడ్యూల్ ఆకారాన్ని, పరిమాణాన్ని పోలి ఉంటుంది. గగన్‌యాన్‌కు ముందు డిసిలరేషన్ సిస్టమ్ (పారాచ్యూట్, పైరో) పనితీరును ధ్రువీకరించుకునేందుకు భారత వైమానికదళ హెలికాప్టర్ ద్వారా ఐఏడీటీ-సీఎంను దాదాపు 4 కి.మీ. ఎత్తు వరకు తీసుకెళ్లి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ నిర్వహిస్తారు.

302 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. తాజాగా 302 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. త్వరలో అటెండర్లు, రికార్డు అసిస్టెంట్లు, యూనియన్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించనున్నారు.

ఎక్సైజ్ తనిఖీల్లో 46.12 లక్షలు స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి. ఆదివారం రూ.38 లక్షల విలువైన 9,120 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. రూ.6.75 లక్షల విలువైన 27 కిలోల గంజాయి, రూ.1.3 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. మొత్తంగా రూ.46.12 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

15 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. అక్టోబర్ 15 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. ఈ నెల 14న అంకురార్పణ జరగనున్నది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. బ్రహ్మోత్సవాల్లో కీలకంగా భావించే గరుడ సేవ ఈ నెల 19న జరగనున్నది. 20న పుష్పకవిమానం, 22న స్వర్ణ రథం, 23న చక్రస్నానం నిర్వహించనున్నది. ఉత్సవాలు జరిగే రోజుల్లో ఉదయం వాహన సేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవని టీటీడీ తెలిపింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్టోబరు 15 నుంచి 23 వరకు అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకరణ సేవలను రద్దు చేసింది. భక్తుల భద్రత దృష్ట్యా 19న ఘాట్‌రోడ్లపై ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేసింది. అక్టోబరు 24న పార్వేట ఉత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ వెల్లడించింది.

తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ భారీగా తగ్గింది. టోకెన్లు లేని భక్తులకు ఐదు గంటల్లోనే శ్రీవారి దర్శనం అవుతుంది. కంపార్ట్‌మెంట్లలో భక్తుల రద్దీ అంతంతమాత్రంగానే ఉన్నది. శనివారం శ్రీవారిని 72,309 మంది భక్తులు దర్శించుకోగా, హుండీ ఆదాయం రూ.4.50 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

నేడు టీటీడీ పాలకమండలి సమావేశం

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సమావేశం సోమవారం జరుగనున్నది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన జరగబోయే ఈ భేటీలో పలు కీలక అంశాలతో పాటు నవరాత్రి బ్రహ్మోత్సవాలపైనా చర్చించనున్నట్టు సమాచారం.

ఇద్దరు ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇద్దరు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న ఏఆర్ శ్రీనివాస్ తెలంగాణ పోలీస్ అకాడమీ అడిషనల్ డైరెక్టర్‌గా, హోంగార్డ్స్ డీఐజీగా ఉన్న అంబర్ కిశోర్ ఝా రాచకొండ జాయింట్ కమిషనర్ (అడ్మిన్)గా బదిలీ అయ్యారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని చెప్పారు.